# అరలు అరలుగా....

## సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

"హలో ! ఉన్నారా అవతల? మాస్టారూ! ఇంతసేపూ నేనే వాగుతున్నా. ఊకొట్టడం కూడా మానేశారు. బోరు కొట్టడం లేదుగదా నేను?"

"అబ్బే... అదేం లేదు. నాకే మూడ్ బాగలేదు." చెప్పాను.

"ఏమైంది మాస్టారూ?"

"ఏదో... పర్సనల్ ప్రోబ్లం..."

"ఐయాం సారీ ! డిస్టర్బ్ చేసినట్లున్నాను.. ఫోన్ పెట్టేయనా సర్!"

"పర్లేదు పర్లేదు.. మాట్లాడు.."

"మొన్న ఫోన్ చేసినప్పుడు కూడా యిదే అనీజీనెస్... యామైకరెక్ట్?"

"అవుననుకో... సమస్య అప్పటిదే.. ఇంకా ఓ కొలిక్కి రాలేదు రాణీ!"

"సర్ ! నాదో డౌట్... యీ డిస్టర్బెన్స్ మిమ్మల్ని రోజంతా వెంటాడుతూనే వుంటుందా? – ప్రోబ్లం సాల్వయ్యేదాకా."

"దాదాపుగా..."

"అంటే... స్కూల్లోకూడానా?"

ఆమె ప్రశ్న అర్థమైంది.

"చాలా వరకు అదుపు చేసుకొనేందుకే ప్రయత్నిస్తాను. మరీ లొంగకపోతే స్కూలుకు సెలవు పెట్టేస్తాను.. వృత్తికి అన్యాయం చెయ్యనులే...."

"సారీ మాస్టారూ ! మీ విధి నిర్వహణ గురించి నేను అనుమానించట్లేదు. ఎప్పటిలా నాతో మనస్సుపెట్టి మాట్లాడలేదనే ఫీలింగ్‌తోనే..."

నవ్వేందుకు ప్రయత్నించాను.

"గతంలో... అంటే పెళ్లయిన కొత్తల్లో నేను కూడా మీలాగే డిస్టర్బ్ అవుతుండేదాన్ని. ఇప్పుడా బాధలేదు. నా ఆలోచనా విధానాన్ని కంపార్ట్‌మెంట లైజ్ చేశా...."

"అంటే....?"

"మెమొరీని కంపార్ట్‌మెంట్స్‌గా డివైడ్ చేసికోవటం... ఒక్కోవిషయానికి ఒక్కో కంపార్ట్‌మెంట్ అలాట్ చేయటం... ఫర్ ఎగ్జాంపుల్.. మీరు నాకు ఫోన్ చేస్తారనుకోండి... మీకు సంబంధించిన కంపార్ట్‌మెంట్ ఓపెన్ అవుతుంది. నేనందులోకి ప్రవేశిస్తాను. మిగతా కంపార్ట్‌మెంట్లన్నీ మూసుకు పోతాయి. వాటి తాలూకు ప్రభావం మన మధ్య

కథ

ఉండదు. మీపరిచయానికి సంబంధించిన ఫీలింగ్ మాత్రమే అక్కడుంటుంది."

నా క్కొంత కొత్తగా అన్పించింది ఆమె చెప్పిన విషయం. మరోమాటలో చెప్పాలంటే గజిబిజిగా కూడా తోచింది. మెదడు కంపార్ట్‌మెంట్స్‌గా విభజన చెంది విధుల్ని పంచుకొని కార్యనిర్వహణ చేస్తుందనే విషయం ఎక్కడో సైన్స్ వ్యాసాల్లో చదివినట్లుంది గాని, అది మనకు ప్రత్యక్షానుభూతికి వచ్చే విషయం కాదుగదా ! అలాంటిది మెదడుకు సంబంధించిన కార్యకలాపాలకు మనమే గదుల్ని కేటాయించడం...

"అదెట్లా రాణీ? మనస్సనేది కంప్యూటర్ లాంటి యాంత్రిక చేతన కాదు గదా ! – ఏ ఫోల్డర్ ఓపెన్ చేస్తే అదిమాత్రమే ఓపెన్ అయి మిగతావన్నీ మూసుకుపోవటానికి".

"మాష్టారూ ! ఇదంతా భౌతికమైన రూపకల్పన కాదు". నవ్వింది. "ఇమేజినేషన్... వూహా.... ఒక విషయాన్నించి మరొక విషయంలోకి ప్రవేశించినపుడు పాత విషయాన్ని పూర్తిగా మరచి, క్రొత్త విషయంలో సంపూర్తిగా మెర్జ్ అయ్యేట్లు అలవాటు పడితే... యీ కంపార్ట్‌మెంటలైజేషన్ అర్థమవుతుంది" చెప్పింది. "మేమెట్లా అలవాటు పడ్డాం సార్ ! కంపార్ట్‌మెంటలైజ్డ్‌గా ఉండకుంటే మేం బతకలేం...." అంటూ ఉదాహరణలతో వివరించసాగింది.

నాకు మాత్రం ఆశ్చర్యంగానే వుంది.

ఒక సంఘటన తాలూకు స్పందనలు మనస్సును బాగా కుదిపినపుడు, వేరే విషయాలు మనస్సులోకి వచ్చినా వీటిమీద దాని ప్రభావం పని చేయకుండా ఎలా వుంటుంది?

మనస్సుకయిన గాయాల్ని కాలమే మాన్పు తుందనేది అనుభవం.

కానీ.... కాలానికి కూడా సంబంధం లేకుండా...?

మిద్దెమీద బాదంచెట్టు నీడలోకూచుని సూర్యోదయంలో కూడా సమస్యనే చూస్తోన్న యీ పొద్దుటిపూట, కొత్తకొత్త సిద్ధాంతాలలో రాణి.


"మావారు యీరోజు చిన్నసైజు టూర్ వేశారు మాస్టారూ!" టాపిక్ మార్చింది. "రూట్స్ నవల్లోలాగా మూలాల్ని వెతుక్కొంటూ పోవటమన్న మాట... నా మూలాలు కాదులెండి. మావారి మూలాలే... వాళ్ళ పూర్వీకులు నివసించిన పల్లెకు టూర్... చాలా మారుమూల పల్లెట. అక్కడ సెల్ సిగ్నల్స్ కూడా అందవని ముందే చెప్పారు. నాఫోన్ పిచ్చి ఆయనకు బాగా తెలుసుగదా ! 'కనీసం యీ రోజన్నా నీ ఫోన్‌ను, ఐప్యాడ్‌ను ఇంట్లోనే వదిలేసి అచ్చం నా భార్యగా వుండు' అంటూ వ్యంగ్యంగా ఓ టచ్ ఇచ్చాడులెండి" చెప్పింది. 'థ్యాంక్ గాడ్ ! ఆయన గుర్తు చేయకుంటే ఐప్యాడ్ మర్చిపోయి వుండేదాన్ని..."రహస్యం చెబుతోన్నట్లుగా వుంది.

నీరసంగా నవ్వాను.

"ప్రయాణమై పోయేముందు నా అభిమాన రచయితలకు ఒక్కసారి కాల్ చేద్దామనిపించింది. చేశానంతే. డిస్టర్బ్ చేసుంటే క్షమించండి..."

"అబ్బెబ్బే.. అదేం లేదు... బెస్టాఫ్‌లక్... మంచి అనుభూతితో తిరిగిరా" చెప్పాను.

ఆర్నెల్లక్రితం ఓ పుస్తకావిష్కరణ సభలో పరిచయమైంది ఆమె. 'ఫలానా కథలు రాసిన రచయిత మీరేనా!" అంటూ కళ్ళనిండా ఓపలేనన్ని ఆశ్చర్యార్థకాలు మొలిపించుకొని పరిచయమైన తీరే




బాగా గుర్తుండిపోయింది. ఒక మధురమైన గొంతుకలో, మాట చాతుర్యంతో ఆమె సభను నిర్వహించిన తీరు నన్ను బాగా ఆకట్టుకొంది.

తర్వాత ఫోను ద్వారా మంచి మిత్రురాలయ్యింది.

తెలుగు సాహిత్యాన్ని బాగా చదువుకొంది ఆమె. కథ, నవల, కవిత - ఏ సాహిత్య ప్రక్రియనైనా బాగా విశ్లేషిస్తుంది. మా మాటల్లో ఎక్కువగా సాహిత్య విషయాలే దొర్లుతుంటాయి కాబట్టి ఆమె స్నేహం ఒక ఉపయోగ కరమైన వ్యాపకమైంది. ఆమె కూడా ఓ ప్రైవేటు స్కూల్‌కు హెడ్ కావటం వలన వృత్తి పరమైన సహానుభూతి తోడై మా స్నేహాన్ని మరింత గాఢతరం చేసింది.

"పైకి తెచ్చేనా... కింది కొస్తావా?" శ్రీమతి అరుపు.

దోసె కాబోలు. నాకు ఆకలిగా లేదు.

మెదడు నిండా సమస్య తాలూకు మేఘాలు కమ్ముకొని వున్నాయి.

అనుకోకుండా వచ్చిన ఆర్థికపరమైన చిక్కు మరో ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి శేఖర్ అనే ఓ నిరుద్యోగికి చిట్ పాడుకునేందుకు ష్యూరిటీ ఇచ్చాం. వాడా డబ్బు తీసుకొని ఆర్నెల్ల తర్వాత ఎటో వెళ్లిపోయాడు. ఇంకో ముప్పయి నెలల కంతులు కట్టాలిట. చిట్ కంపెనీ మమ్మల్నికోర్టుకు లాగింది. రెండు మూడు నెలలు వాడికోసం గాలించాము. తంటాలు పడ్డాము. చివరినిమిషంలో అయినా వచ్చి సమస్యను తెంచుతాడనీ, మమ్మల్ని కోర్టుకు వెళ్ళకుండా ఆపుతాడని ఆశపడ్డాము. రేపే కోర్టు వాయిదా. తప్పక హాజరుకావాలి. ఒక ముద్దాయిగా కోర్టు మెట్లెక్కడం నా జీవితంలో ఎరుగను. ఆ భావన కూడా నన్ను పీడిస్తోంది. కడుపులో చల్ల కదలకుండా ఉద్యోగం చేసుకొంటూ బతుకుతోన్న నాకు చివరికి యీ గతి పట్టింది. తల్చుకొంటే అవమాన కరంగా వుంది. అలాగని కోర్టుకు వెళ్ళకూడదనుకొంటే నాపాలి ముప్పైవేల రూపాయలు రేపటి లోపల చెల్లించాలి.

ప్లేటుతో మిద్దెపైకి వచ్చింది శ్రీమతి.

"దిగులు పడితే వాడొస్తాడా ! లెక్కగడ్తాడా? యాన్నోచోట అప్పో సప్పో దెచ్చి మీరే కట్టండి... యీ దిగులన్నా పోద్ది" అంటూ ప్లేటు నా ముందుకు చాచింది.

ఆమెకేసి గుర్రుగా చూశాను.

"ఇంట్లో కూచొని మాట్లాడ్డం కాదు. సంపాదించేవానికి తెలుస్తది" అన్నాను.

"సంపాయించి సుగమేంది? - ఇట్లాంటి పోరంబోకుల వాతగొట్టడానికా?" అంటూ ప్లేటు నాచేత బెట్టి వెనుదిరిగింది.

అంటే.... నేను ష్యూరిటీ ఇవ్వబోయే వ్యక్తి పోరంబోకయిందీ, మంచివాడయిందీ తెలుసుకోక పోవటం నా తప్పేననే ధ్వనిఆమెమాటల్లో.

సానుభూతి పలికి అనునయించే బదులు సాధింపు....

చర్రున మండింది నాకు.

ప్రతిధ్వనించాలనిపించింది నాకు - ఆమె గూబ గుయ్యిమనేలా.. నరాలు తెగేలా....

తొంగి చూశాను.

సగం తాపలు దిగిపోయి వుంది.

ఒక్కక్షణం తటపటాయించాను.

ఆమె మీద ప్రతిదాడికే మనస్సు మొగ్గింది.

"యీ నోరు మీ పుట్టింటికాడ ఎందుకు తెరుచుకోదు? మీ పెద్దమ్మ కొడుకుంటే మీ అన్నేగదా! వాడు పోరంబోకయ్యిందీ మంచోడయ్యిందీ నీకు తెల్దా? బ్యాంకులో లోనుపెట్టి తెచ్చిస్తినే... ఎవర్నని ఏం లాభం ? నా చేతులు మంచివి కాదు. యీ చేతుల్తో నాకొడుక్కిచ్చినా తిరిగి వచ్చేది లేదు..." ఆక్రోశంగా అన్నాను.

కొంతసేపయింతర్వాత ఇంట్లోంచి ఏడుపు రాగాలు - అన్నను తిట్టుకొంటూ... పుట్టింటిమీద దుమ్మెత్తిపోస్తూ...-

ఎదలోపల సన్నని అలజడి 'తొందర పడ్డానేమో' అని.

కుర్చీలో వెనక్కి వాలి ఆలోచనల్లోకి జారాను.

పొరపాటు చేశానేమో ! అనవసరంగా ఆమెను హింసించాను. నా బాధలో పాలు పంచుకోలేదనే వెక్కస ఒకటి మనసులోంచి తన్నుకొచ్చి నా విచక్షణను చిదిమేసింది.

లోకం తెలీని అమాయకురాలి కంట కన్నీరు తెప్పించాను.

మనస్సు మరింత ఖరాబయ్యింది.

సహ బాధితులైన మిత్రులకు ఫోన్ చేశాను. వాళ్ళపరిస్థితి మరింత విషా దంగా వుంది. ఇంట్లో ఆడవాళ్ళ పోరు ఎక్కువైందని వాపోయారు. ఇంటికి పోవటానికే భయంగా వుందిట. శేఖర్ వద్దనుంచి డబ్బురాబట్టకుంటే అన్నం కూడా పెట్టేదిలేదంటూ తీర్మా నించారుట.

వాళ్లతో పోల్చుకుంటే నేను చాలా అదృష్టవంతున్ని.

ఇంటిపోరు లేదు.

డబ్బు పోగొట్టి అయినా మనశ్శాంతి తెచ్చుకోమంటుంది తను.

డబ్బు పట్ల ఏదో చులకన భావం, ఉదాసీనత నాకామెలో కన్పిస్తోంది. జరుగుతోన్న ఆర్థిక నష్టాన్ని గురించి నాలాగే ఆమె కూడా బాధపడటం లేదనే ఆక్రోశం నాలో వుంది. బాధపడకుండా ఉండటం పట్ల అసూయ కూడా ఉన్నట్లుంది.

అలాగని మిత్రుల భార్యల్లాగా నన్నూ నిలదీసి ఇబ్బందిపెడితే తట్టుకోగలనా ?

"నాన్నా ! నాన్నా !" తాపల మీంచి పిలుపు.

"వాడు... రమేష్‌గాడు బాల్ తెచ్చుకున్నాడు. నువ్వు మొన్ననే తెస్తానంటివి. ఇంకా తీసుకురాలేదు.... వాడేమో నన్ను ఎగతాళి జేస్తాండు. బ్యాటూ బాలూ రొండూ కావాల. ఎప్పుడు తెస్తావునాన్నా?" గోముగా రాగందీస్తూ వస్తున్నాడు.

ఈ మూడ్‌లో వీడొకడు. వానికి సమాధానం చెప్పేంత ఓపిక ఎక్కన్నుంచి తీసుకరాను.

కసరుకొని గద్దించేందుకు సిద్ధమయ్యాను.

అంతలో శ్రీమతి గొంతు "చిన్నా ! దిగిరా! నాన్న ఏదో పన్లో వుండాడు. ఇట్లారా ! దిగిరా !... నేన్జెప్పి కొనిస్తాలే... బంగారు గదూ... రమేసు కంటే మంచి బాలు కొనిస్తా గాని... దిగిరా చిన్నా !... దిగిరా.. అంటూ ప్రేమగా.

బతికించింది.

దిగిపోయినట్టుంది వాడు. ఇంకా ఏదో మారాం చేస్తోన్న సవ్వడి.

పది నిమిషాల తర్వాత కిందకు తొంగిచూస్తే - కొడుకును బుజ్జగిస్తూ ఆమె. ఒళ్లోపడుకోబెట్టుకొని ఏవేవో మాటలు చెబుతోంది. వాన్ని నవ్విస్తోంది. వాడి లోకంలోకి సంపూర్ణంగా వెళ్ళిపోయింది.

నాక్కొంత ఆశ్చర్యంగా అన్పించింది.

తను అప్పుడే ఏడుపు మానటం... బాధ నించి బైట పడటం...

ఏదేమైనా - ఆమెను మానసికంగా హింసించాననే గిల్టీ కాన్షస్‌నించి నన్ను తప్పించింది. అదే పదివేలు.

మెల్లిగా లేచి కిందకు వెళ్ళాను.

గూట్లోంచి 'రారా'ను తీసి, చాప దిండుతో మిద్దెపైకి వెళ్లాను.

పడుకొని పుస్తకం చేతబట్టుకొన్నాను.

పేజీలమీద చూపులైతే కదులుతున్నాయి గాని మనస్సు నిలబడటం లేదు.

సాహిత్యస్పర్శతో అయినా మనోవేదనను కొంతసేపు మరుద్దామనుకున్నాను గాని కుదరలేదు.

బాదంచెట్టు కొమ్మల్లోంచి కాకి అరుపు విన్పిస్తోంది.

ఎండ ఎక్కువయ్యేకొద్దీ నీడ మరింత చల్లగా అన్పించసాగింది. నా సహబాధితుల్లో ఒకరినుంచి ఫోనొచ్చింది.

శేఖర్‌గాడు విజయవాడ ఏరియాలో ఎక్కడో వున్నట్టు సమాచారం అందిందట. నిర్ధారణ చేసికొని జీపులో వెళ్ళి వాన్ని కట్టేసుకు రావాలని నిర్ణయించారు..... నన్ను సిద్ధంగా ఉండమన్నారు.

మధ్యాహ్నం అబ్బాయి వచ్చి భోజనానికి పిల్చాడు.

నేను కదల్లేదు.

పది నిముషాలు ఆగి తనే వచ్చింది శ్రీమతి "ఆకలిగా లేదా?" అంటూ.

ఆమెకేసి ప్రసన్నంగా చూసి లేచాను.

భోంచేసి పడుకోగానే నిద్రబట్టింది. బహుశా శేఖర్ దొరుకుతాడేమోననే ఆశ నాలోని ఆదుర్దాను తొలగించి వుంటుంది కాబోలు.

సాయంత్రంగాచేలకేసి వెళ్ళాను.

ఈ యేడాది వర్షాలు బాగా కురవటం వలన నేలంతా పైరుపచ్చలతో కలకలలాడుతోంది. నెలల తరబడి మబ్బులు కమ్మి వుండటంవలన పైర్లను తెగుళ్ళు ఆశించాయి. కాయల బరువుతో కిందకు వంగబడి వుండాల్సిన కందిచెట్ల కొమ్మలు చేతివేళ్ళలా నిటారుగా ఆకాశంకేసి చూస్తున్నాయి. పొద్దు తిరుగుడు కంకుల్ని కూడా పురుగులు చుట్టుముట్టాయి. చేలల్లో ఏ మూల చూసినా పవర్ స్ప్రేయర్ల రొద విన్పిస్తోంది. పురుగుమందుల వాసన వాతావరణం నిండా అలుముకొని వుంది.

పొద్దుగుంకి ఇంటికి తిరిగొస్తోండగా రాణి వద్దనుంచి ఫోన్.

తన భర్తగారి పూర్వీకుల వూరిని వెదుక్కుంటూ వెళ్లారుట. అచ్చు నా కథల్లో లాంటి మనుషులే అక్కడున్నారట. "అమ్మయ్యా !" అంటూ దగ్గరకొచ్చి ఆప్యాయంగా పలుకరించి పరిచయం చేసికొన్నారుట. పాతకాలపు బాపనయ్యగారిని, అమ్మయ్యగార్లనూ గుర్తుజేసికొన్నారుట. వాళ్ళు ఇంగువ చారు వాసన గురించీ, అంటు మడి కట్టుబాట్ల గురించీ చెప్పుకొచ్చారుట. అయ్యగారి నియమనిష్టల్ని బాగా పొగిడారుట. తర్వాత వీళ్ళు తమ పూర్వీకులు కట్టించిన దేవాలయంలోని ఆంజనేయస్వామికి పూజలు పునస్కారాలు నిర్వహించారుట.

సుబ్బారెడ్డి అనే ఓ రైతు వీళ్ళని తన యింటికి ఆహ్వానించాడుట. ఇంట్లోకి అడుగుపెడుతూనే మాగిన రొచ్చువాసన ముక్కుల్ని ఇబ్బంది పెట్టిందట. వేడి వేడిపాలు ఇచ్చారుట. పొగ వాసన వేస్తోంటే.. కాఫీ పొడి లేకుండా తాగటం వెగటుగా అన్పించిందట.

"వాళ్ళ బాత్రూం చూశాను మాస్టారూ ! నాకైతే వింతగా అన్పించిందనుకో. ఎంత యిరుగ్గా వుందనీ ! అందులో ఎట్లా స్నానం చేస్తారో అర్థమే కాలేదు. నిటారుగా వెళ్దామా - తలబొప్పి కడుతుంది. లోపలి కెళ్ళి పొరబాటున చేయి అటు ఇటూ చాచామా - గోడ పొడుచుకుంటుంది. మనిషి ఫ్రీగా కదిలేంత స్థలమయినా కావొద్దా ! నాగరికత తెలీని మనుషులు" చెప్పింది

చిన్నగా నవ్వాను నేను. "మంచం చాటు జేసుకుని నీల్లు పోసుకొనే వాళ్లకు ఆమాత్రం గోడచాటు దొరకటం గొప్పేగదా !" అన్నాను. "బాత్రూం అంటే రాణీకిలా - అదో విశాలమైందిగా, టైల్స్ వేసి కట్టిన అందమైందిలా, ఎంతసేపయినా అక్కడే గడపాలని పించేంత సుఖమైందిలా ఉండాల్సిన అవసరం వాళ్లకు లేదుగదా ! బాత్రూంను అంత గొప్పదిగా వాళ్ళెప్పుడూ వూహించరు తెలుసా? మనిషి బైటకు కనబడకుండా రవ్వంత చోటు దొరికితే చాలు..." చెప్పాను.

"ఊ... సరేలే... మీ పల్లె వాళ్ళే కాబట్టి అన్నిటికీ వెనకేసుకొస్తారు..." ఉడుక్కొంది.

"అదంతేనమ్మా ! ఆ కాస్త చాటు కూడా ఆడవాళ్ళకోసమే. మగవాళ్లు చాలావరకు బైటే స్నానం చేస్తారు...." చెప్పాను. "మంచి బాత్రూమును కూడా వూహించుకోలేని స్థితిలో వున్నారు ఆ సీమలోని మెట్టరైతులు. వాళ్ల ఆర్థిక పరిస్థితి అట్లా వుంది మరి..." అన్నాను.

"ఓ.కె.. ఇట్సాల్‌రైట్... ఆ విషయాన్ని వదిలేద్దాం... య్.. య్... ఇంకో వింత ఏమంటే మాస్టారూ....!" అంటూ హుసారుగా చెప్పింది "మేం చూస్తోండగానే ఓ మనిషి చింతచెట్టు మొదలు కరచుకొని సరసర పాక్కుంటూ ఎక్కిపోయాడు. కొమ్మ చివర్లకు వెళ్ళి, అక్కడ రెండు కొమ్మల జాయింట్లో....."

"దాన్ని 'పంగ' అంటారు"

"ఆ.. పంగల్లో కూచున్నాడు. అక్కన్నించి అతనేం చేస్తున్నాడో తెలుసా? బైటి ప్రపంచపు తలుపులు తడుతున్నాడు."

నాకు అర్థం కాలేదు.

పకపక నవ్వింది రాణి. "సెల్‌ఫోన్ తీసి మాట్లాడుతున్నాడు సార్! అక్కడయితేనే సిగ్నల్స్ అందుతాయిట. నాకయితే అదో వింతగా అన్పించిందనుకో.... మా ఆయన అటుకేసి వేలు చూపించి 'సెల్ తెచ్చుకొని వుంటే నిన్నూ అక్కడ వూహించాల్సి వచ్చేది' అంటూ కామెంట్ చేసేసరికి ఉడుక్కొన్నాను. అయినా మాస్టారూ !- నాకాదృశ్యం ఇప్పటికీ



హైదరాబాదు సుందరయ్య కళానిలయంలో ఇస్మాయిల్ మిత్రబృందం, మానస ఆర్ట్స్ థియేటర్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన సభలో శ్రీ జొన్నలగడ్డ వెంకటేశ్వరశాస్త్రిని బ్రౌన్ పురస్కారం (రు.10,116/-)తో కవి సి. మోహన్‌ను ఇస్మాయిల్ సాహితీ పురస్కారం (రు. 10,116/-)తో సత్కరిస్తున్న వెన్నెలకంటి ప్రకాశం, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, చిత్రంలో రఘుశ్రీ, సి.ధర్మారావు, ముకుంద రామారావు, జితేంద్రబాబు ఉన్నారు.

ఆశ్చర్యమే. మనిషిని చింతచెట్టు ఎక్కించి మరీ తనకేసి లాక్కొంటోన్న గ్లోబలైజేషన్ విశ్వరూపపు నీడలు నాకా కొమ్మల్లో కనిపించాయనుకోండి".

ఆమె మాటల్ని అర్థం చేసుకొంటున్నాను.

"నాకా మొండిగోడల యిల్లూ, యిరుకు సందుల వీధులూ... మొండిగోడల్లోకంపచెట్లు మొలిచీ, ఇళ్లల్లో రొచ్చు వాసనా, పొగచూరిన పాలూ, ఎలుక కలుగుల్లాంటి బాత్రూంలూ... నాకాపల్లె అస్సలు నచ్చలేదనుకోండి.... ఈ ప్రయాణంలో నాకు నచ్చిన అద్భుతదృశ్యం ఒక్కటే.. నా కళ్ళమీద ఇంకా ఆ దృశ్యాల తాలూకు అనుభూతులు అలుముకొనే వున్నాయి... తిరుగు ప్రయాణంలో... సాయంత్రపు ఏటవాలు ఎండలో, అనేకానేక చతురస్రాకారపు రాగి పలకల్లాంటి కయ్యలన్నీ కలిసి విశాలమైన మైదానమై కన్పిస్తూ.. ఆ బీడు భూముల్లో అక్కడక్కడా కాపలా మనుషుల్లా చెట్లూ, దూరంగా జింకల మందలూ, వాటి వెనగ్గా ఒకరో ఇద్దరో మనుషులూ... అదో అద్భుత దృశ్యమనుకో మాస్టారూ ! కారు ఆపించి మరీ ఆ దృశ్యాన్ని తనివిదీరా చూశాను...." చెప్పింది.

ఆమె చూసిన దృశ్యమేదో నాకు అర్థమైంది.

ఆ ప్రాంతపు నైసర్గిక స్వరూపం నాకు బాగా తెలుసు. ఆ నేలకథ కూడా తెలుసు. ఈమధ్యతరుచూ వార్తల్లోకి కూడా ఎక్కుతోంది ఆ ప్రాంతం.

"అయ్యో అయ్యో...." అంటూ తల పట్టుకొన్నాను.

"వాట్ సర్? వాట్ హ్యాపెండ్?"

"ఆ దృశ్యం నీకంత అద్భుతంగా కన్పించిందా?"

"అవును కదా !"

"దాని వెనక బీభత్సం నీకర్థం కాలేదా?"

"బీభత్సమా ! వాడ్డూయూమీన్?"

"ఇది సంక్రాంతి సీజన్ తల్లీ ! పండిన పైరుతో భూమి పులకించి పోవలసిన కాలం. నువ్వు చూసిన పొలాలు ఎందుకు బీళ్ళుగా పడున్నాయో నీకు తెలుసా?"

"అవును గదా ! పైరుండాలి గదా !" ఆలోచనగా అంది.

"ఆ ప్రాంతంలో మెగా ఫ్యాక్టరీ ఒకటి స్థాపించబడుతూ వుంది. నువ్వు అద్భుతదృశ్యాలుగా వర్ణించే పొలాలన్నీ నామమాత్రపు రేట్లతో ఫ్యాక్టరీ గోడల్లోకి పోయాయి. విషాదం ఏమంటే - ఫ్యాక్టరీ మేనేజిమెంటు నించి పొలాల డబ్బు ఇంకా రైతులకు అందలేదు. ఇంత మంచి వర్షాలు కురిసి కూడా పొలం సాగుచేసేదానికి లేదు. ఏడ్చి మొత్తుకోవటం, పేపర్ల కెక్కటం తప్ప రైతులకు దిక్కు లేదు. ఇంకో విషయం - నువ్వు చూసింది జింకల మందల్ని కాదు. గొర్రెల మందల్ని. వెనకుండే వాళ్ళు కాపర్లు. జింకలు మందలు మందలుగా తిరిగే కాలం ఎప్పుడో గతించిపోయింది తల్లీ ! అయినా జింకల్ని ఎవ్వరూ కట్టెబట్టి కాయలేరు.. నీ అందమైన అద్భుతమైన దృశ్యం వెనుక విషాదం ఇదీ !" చెప్పాను.

"అవునా!" అంటూ కొద్ది క్షణాల మౌనం తర్వాత మళ్ళీ గొంతు విప్పింది. "కావొచ్చు. బట్... నాకా దృశ్యం ఇప్పటికీ అందంగానే కన్పిస్తోంది. మీరింత కెలికినా చెరిగిపోవట్లేదు. నిజమే.... ఆ దృశ్యం వెనక గొప్ప విషాదమే ఉండొచ్చు. అలాగని దాని అందాన్ని ఆస్వాదించకుండా ఉండలేం గదా! అట్లా ఆలోచించుకుంటూ పోతే యీ ప్రపంచంలో ఏ అందాల్నీ చూడలేం సార్ ! తాజ్‌మహల్ దగ్గరకు వెళ్ళి రాళ్ళెత్తిన కూలీల గురించి ఆలోచిస్తూ వెనక్కి రాలేం గదా !"

"నువ్వు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నావు రాణీ ! ఇది బర్నింగ్ ప్రోబ్లం. దీనికీ దానికి ఏమిటి సంబంధం? కళ్లముందు కన్పించే విషాదం ఇది..."

"నేను కాదనటం లేదు సార్ ! ప్రాబ్లం ప్రాబ్లమే... సౌందర్యం సౌందర్యమే అంటున్నా... సమస్యకోసం స్ట్రగుల్ కావాలి. అందాన్నీ ఆస్వాదించాలి... మీరు కంపార్ట్‌మెంటలైజ్డ్‌గా ఉండక పోవటం వల్లే యీ డిస్టర్బెన్స్ అంతా..." చెప్పింది.

"అదెట్లా సాధ్యమవుతుంది రాణీ? కళ్ళ వెనక విషాద దృశ్యాలు తాండవిస్తోంటే... కళ్లముందు అందాల్ని వెదకి ఆస్వాదించాలనుకోవటం తలచుకొంటేనే ఒళ్ళంతా కంపరంగా వుంది...."

"మాకు సాధ్యమే సార్ !" స్థిరంగా వుంది ఆమె గొంతు. "మాకు అంటే మా టౌనువాళ్ళ కని కాదు. మా ఆడవాళ్ళకు. కంపార్ట్‌మెంటలైజ్డ్‌గా థింక్ చేయకుంటే కుదరదు. మాకు తెలీకుండానే మేమట్లా అలవాటు పడిపోతాం... మీరు మమ్మల్ని తిడతారు. మామీద అహం తాలూకు జులుం ప్రదర్శిస్తారు.మేం నిలువునా దహించుకుపోదామనే బాధ. యీలోపే పిల్లలొస్తే వాళ్ళముందు లాలించే అమ్మలం కావాలి. తప్పనిసరి.. ప్రత్యామ్నాయం లేదు. మిమ్మల్ని ఓ సమస్య వెంటాడినపుడు ఏకాంతంగా కూచుని దాన్ని అనుభూతించే స్వేచ్ఛ మీకుంటుంది. మిమ్మల్నెవరూ డిస్టర్బ్ చేయరు. పిల్లలొచ్చి మిమ్మల్ని విసిగించబోయినా 'నాన్న మూడ్ బాలేదు. దగ్గరకు వెళ్లొ'ద్దని చెప్పి ఆపేందుకు మేమున్నాం. మాకట్లా కాదు గదా ! బాధను కూడా పూర్తిగా ఎదల్లో ఇంకించుకొనేందుకు లేదు. అందుకే మాకు తెలీకుండానే మేం మెదడులో అరల్ని సృష్టించుకొంటాం. అవునుసార్ ! - కంప్యూటర్‌లాగా ఒక్కో విషయానికి ఒక్కో ఫోల్డర్ క్రియేట్ చేసుకోవలసిందే. ఎంత హింసను అనుభవించినా సమయానికి వంట చేయవలసిందే. పిల్లల్ని తయారుచేసి స్కూలుకు పంపవలసిందే... మీకులా సెలవుపెట్టి విషాదాన్ని నెమ్మదిగా జీర్ణించుకొనేందుకు మాకెక్కడవుతుంది చెప్పండి... అప్పటికప్పుడు లాలించే తల్లులం కావాలి. హింసను భరించే భార్యలం కావాలి. కమ్మగా వండి వడ్డించే ఇల్లాళ్లం కావాలి. పడక సుఖాన్నిచ్చే అర్థాంగులం కావాలి...." ఆమె గొంతులో ఏదో కనిపించని తడిజీర.

ఉలిక్కి పడ్డట్టయింది నా మనోస్థితి.

కళ్ళముందు చాలా సంఘటనలు గిర్రున సినిమా రీళ్లలా తిరిగాయి.

చదువురాని పల్లెటూరి పిల్ల అయిన నా భార్య, కంపార్ట్‌మెంట్ అనేపదం ఎప్పుడూ విని వుండని తను, రాణి చెప్పినట్లు కంపార్ట్‌మెంటలైజ్డ్ ఆలోచనా విధానంలోనే వుంది. ఉదయం నేను మాటలతో గాయపరిచినా, పిల్లవాన్ని చూడగానే అన్నీ మరిచిపోయి వాడి స్పర్శలో లీనం కావటం, నేను హింసించిన వైనాన్ని కూడా మరచి భోజనానికి పిలవటం....., ఆమె కూడా కంపార్ట్‌మెంట్స్ ఏర్పాటు చేసికొంది... ఏర్పాటు చేసికొనేలా అందరు మగాళ్లలా తనూ ప్రవర్తించాడు. సందేహం లేదు.

నిజానికి ఆమె యిచ్చిన సలహా పనికి రానిదేమీ కాదు. చీటీ పాడుకొన్న శేఖర్ ఆ డబ్బుతో వ్యాపారమే చేసుంటే బాగు పడుండేవాడేమో! భూమిని కౌలుకు తీసికొని వ్యవసాయం చేశాడు. ఉన్న డబ్బు కాస్తా మట్టిపాలు చేసి దేశాలు పట్టి పోయాడు. ఇప్పుడతన్ని పట్టుకొని యీడ్చుకొచ్చి కట్టేసి నా డబ్బెక్కన్నించి తేగలడు? అనవసర కాలయాపన.. శ్రమ..ఖర్చు... అదనపు హింస తప్ప. నా పాలిడబ్బు చెల్లించి చేతులు దులుపుకొంటేనే మనశ్శాంతిగా వుంటుందేమో !

కొత్త నిర్ణయంతో మనస్సు కొంత తేలికైంది గాని, దాన్ని సూచించిన శ్రీమతి పట్ల నా ప్రవర్తన గుర్తొచ్చి లజ్జగా అన్పిస్తోంది.

రాణి చెప్పినట్లు - నేనంతా ఒక అరగా, ఒక కంపార్ట్‌మెంట్‌గా శ్రీమతి మెదడులో నిక్షిప్తమై, ఆ కంపార్ట్‌మెంట్ తెరవగానే నేను నేనుగా. ఒక మగాడిగా. ఒక మొగునిగా కన్పిస్తే సంతోషమే. నేను మళ్ళీ ఎన్నో అరలుగా విభజించబడి.. కోప్పడే మొగునిగా, దండించే మొగునిగా, తిట్టే మొగునిగా, చిన్న చిన్న విషయాల్ని కూడా విమర్శించే మొగునిగా, చదువు కలిగించిన ఆధిపత్యభావాలున్న మొగునిగా... ఇట్లా రకరకాల పేర్లతో ఫోల్డర్స్‌గా విడగొట్టబడి వుంటానేమోనని అనుమానంగా వుంది. ఆమె మెదడనే కంప్యూటర్ ఓపెన్ కాగానే అన్‌యూజ్‌డ్ ఫోల్డర్స్ కింద 'సంతోషపెట్టే మొగుడు', 'అభిప్రాయాల్ని గౌరవించే మొగుడు', 'శ్రమలో పాలు పంచుకొనే మొగుడు' లాంటి పేర్లకు సంబంధించిన వివరాలుంటాయేమోనని చచ్చేంత సిగ్గుగా వుంది.